క్లుప్తంగా

తాగునీటి అవసరాలకు ట్యాంకర్ల ఏర్పాటు

కృత్తివెన్ను: తాగునీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపామని అవసరమైన చోట ట్యాంకర్లు ఏర్పాటు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ మనోజ్ తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం కృత్తివెన్ను మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. ఏఓ జెన్నీ, ఎంపీడీఓ పిచ్చిబాబు, డీటీ శశికుమార్, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, శిరీష, అధికారులు పాల్గొన్నారు.

మూల్యాంకనం పరిశీలకులుగా మస్తానయ్య



పెడన: కృష్ణాజిల్లా పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం పరిశీలకులుగా విద్యాశాఖ ఉన్నతాధికారులు సిమాట్ డైరెక్టర్ వీఎస్ మస్తానయ్యను నియమించారు. సోమవారం ఆయన జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా, ఏసీ డేవిడ్‌రాజులతో పాటు డీవైఈఓలు, మూల్యాంకన కేంద్రంలో పర్యవేక్షించే అధికారులతో మూల్యాంకనంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం కేంద్రంలో మౌలిక వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్కూల్ హెచ్ఎం మెటల్దారాణి పాఠశాలకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేశారు.

హంసలదీవి హుండీ ఆదాయం రూ.2.07 లక్షలు

కోడూరు: హంసలదీవిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయానికి హుండీ ద్వారా రూ.2.07 లక్షల ఆదాయం లభించినట్లు ఈఓ సీహెచ్ సుధాకర్ తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో దేవదాయ అధికారులు హుండీ లెక్కింపు చేపట్టారు. మూడు నెలలకు గాను రూ.2,07,645 ఆదాయం సమకూరిందని సుధాకర్ చెప్పారు. సర్పంచ్ కొక్కిలిగడ్డ బిక్షాలు, సిబ్బంది ఏడుకొండలు, ప్రసాద్, గిరి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరం శివారు పాశ్చాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ సువర్చలాంజనేయస్వామివారి ఆలయంలో సోమవారం హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి పలు రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. పండితులు రొంపిచర్ల హనుమంతాచార్యులు శిష్య బృందం వేద మంత్రాల మధ్య అభిషేకాలు, చాలీసా పారాయణం జరిగింది.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నడకుదురు(చల్లపల్లి): బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. చల్లపల్లి మండలం నడకుదురు గ్రామంలో బాలికకు వివాహం చేయనున్నట్లు తెలుసుకున్న ఐసీడీఎస్, పోలీస్, పంచాయతీ అధికారులు బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక పదో తరగతి మధ్యలో చదువు మానేసి ఇంట్లో ఉంటున్న నేపథ్యంలో ఆమెకు హనుమాన్ జంక్షన్‌కు చెందిన యువకుడితో బాల్య వివాహం చేసేందుకు బాలిక తల్లిదండ్రులు నిశ్చయించారు. త్వరలో వివాహం చేయనున్నట్లు తెలుసుకున్న అధికారులు బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహ నిరోధక చట్టం 2006 నిబంధనలు వివరించారు. చట్టాన్ని ఉల్లంఘించి బాలికకు వివాహం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. వివాహం చేయబోమంటూ ఆమె తల్లిదండ్రుల నుంచి లిఖితపూర్వక హామీ పొందారు. ఎస్ఐ సీహెచ్.చినబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై శిక్షణ

బంటుమిల్లి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది బంటుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ప్రమాదాల నివారణపై శిక్షణ ఇచ్చారు. అగ్ని ప్రమాదాలు, నీటిలో మునిగిపోయిన ప్రాణాలతో ఎలా బయటపడాలో విద్యార్థులతో డెమో చేయించి అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలు ప్రారంభం

గణపేశ్వరం(నాగాయలంక): మండల పరిధిలోని గణపేశ్వరంలో ప్రసిద్ధి గల దుర్గా-గణేశ్వరస్వామి, పార్వతీ-సంగమేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి(రాంబాబు), ఈఓ పామర్తి సీతారామయ్య పర్యవేక్షణలో అర్చకులు పి.నాగవెంకట సాయిశర్మ, పోతుకూచి సత్యనారాయణ బ్రహ్మత్వంలో తొలుత పుణ్యాహవాచన, గణపతిపూజ తదితర విశేష కార్యక్రమాలు జరిపారు. స్వామి అమ్మ వార్లను పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెలను చేశారు. రాత్రికి యాగశాల ప్రవేశం, అంకురారోపణం, ధ్వజారోహణం, బలిహరణ కార్యక్రమాలు జరిగాయి. పూజా కార్యక్రమాల్లో ఎంపీపీ భోగాది రాఘవరాణి, మండల అరుణ పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగనన్న పథకాలతో నవశకం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఉల్లిపాలెం, హరిపురంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్న పథకాలతో ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు వికసిస్తున్నాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఉల్లిపాలెం సచివాలయ పరిధిలోని హరిపురం, నరేంద్రపురం, పర్రూరివారిపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే రమేష్‌బాబు, యువ నేత సింహాద్రి వికాస్‌లు నిర్వహించారు. అధికారులు, పార్టీ నేతలతో కలిసి వారు ఆయా గ్రామాల్లో 433 గృహాల వెళ్లి ప్రభుత్వ పథకాలతో పాటు ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన బుక్‌లెట్‌ను అందించారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికే చేరుతుండడంతో లబ్ధిదారులు రమేష్‌బాబు, వికాస్ వద్ద హర్షం వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పథకాలతో ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని, జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలకు వెళ్లకుండానే సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

90 రోజుల్లో స్థలం మంజూరు

అర్హత ఉంటే పథకాలు ఇంటికే వస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. ఇళ్ల స్థలాలు రానివారికి కూడా అర్హత ఉంటే 90 రోజుల్లో స్థలం మంజూరు చేస్తామని, రహదారుల నిర్మాణానికి కూడా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని రమేష్‌బాబు గ్రామస్తులకు వివరించారు. ప్రతి ఇంటి వద్ద అపూర్వ ఆదరణ లభిస్తుందని వికాస్ అన్నారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, సర్పంచ్ వెర్రి పావని, శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు, సచివాలయ కన్వీనర్లు కమ్మిలి కోటేశ్వరరావు, సనకా రాము, ఆరే పావని, ఉప సర్పంచ్ ఆరే కిరణ్, నాయకులు కొక్కిలిగడ్డ శ్రీమన్నారాయణ, గుర్రం బసవయ్య, కొండవీటి వీరవెంకట నారాయణరావు, చిలకలపూడి ధర్మయ్య, కోలా గోపి, ఎంపీటీసీలు సనకా శైలజ, బడే గంగాధరరావు, వెన్నా ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సత్యసాయి ప్రకాష్, ఎంపీడీఓ పాండురంగారావు, ఎస్ఐ రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్డీ యలవర్తి సుబ్రహ్మణ్యం, ఏఈఓ సురేష్, వివిధ శాఖలాధికారులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక మసీదు వద్ద సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సింహాద్రి, డీఎస్పీ మహబూబ్ బాషా, వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రామకృష్ణ, ఎస్ఐ రమేష్, మండల కోఆప్షన్ సభ్యుడు నజీర్‌బాషా పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొంతమంది ముస్లింలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే సింహాద్రి దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఖాజీ మహబూబ్ పాషా, మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్‌రెహ్మాన్, మాజీ అధ్యక్షుడు షేక్ చాన్‌పాషా, షేక్ షబీ ఉల్లా, సచివాలయ కన్వీనర్ ఖాదర్‌వలీ, అజీజ్ ముస్లింలు పాల్గొన్నారు.



రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని విజయవాడలోని విద్యాధరపురంలో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి హాజరైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రి జోగి రమేష్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఆత్మీయ స్వాగతం పలికారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

హామీలు నెరవేర్చిన ఆదర్శ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

చోరంపూడి సభలో మంత్రి జోగి రమేష్



చోరంపూడిలో వైఎస్సార్ ఆసరా చెక్ అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

బంటుమిల్లి: ప్రజాసంకల్ప యాత్ర ద్వారా గుర్తించిన ఇబ్బందులను పరిష్కరించేందుకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 90 శాతం పూర్తి చేసిన ఆదర్శ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. మండల పరిధిలోని చోరంపూడి గ్రామంలో సోమవారం వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ ప్రజల సమస్యలను అవగాహన చేసుకుని నవరత్నాల పథకాలు రూపొందించిన ముఖ్యమంత్రులు లేరన్నారు. పేద కుటుంబాల ఆర్థిక సమస్యలను అవగాహన చేసుకున్న జగనన్న ఆర్థిక, విద్య, వైద్య సాయం కోసం ఏర్పాటు చేసిన పథకాలు పేద కుటుంబాల్లో ఆనందాన్ని నింపాయని మంత్రి పేర్కొన్నారు. జగనన్న వెంట నడవాలని మంత్రి జోగి పిలుపు ఇచ్చారు. మీ సమస్యల పరిష్కారానికి తన వంతు అండగా ఉంటానని ఏ సమయములోనైన ఫోన్ చేయాలంటూ మంత్రి తన ఫోన్ నంబరును డ్వాక్రా సభ్యులకు ఇచ్చారు.

రూ.1.52 కోట్ల చెక్కు అందజేత

అనంతరం చోరంపూడి, మల్లంపూడి, ములపర్రు, నాగన్నచెరువు గ్రామాలకు చెందిన 192 డ్వాక్రా గ్రూపుల్లో నమోదైన 1,927 మంది సభ్యులకు ప్రభుత్వం విడుదల చేసిన ఆసరా నగదు రూ.1.52 కోట్ల చెక్కును మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి సభ్యులు, బుక్ కీపర్లు ఘన స్వాగతం పలికి సత్కరించారు. పలువురు నాయకులు ప్రసంగించారు. సచివాలయ మండల కన్వీనర్ కె.సుబ్బారావు ప్రసంగం ఆకట్టుకుంది. కార్యక్రమంలో మండల వైస్ చైర్మన్ చిన్నారిబాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ఎం.రత్నకుమారి, ఎంపీటీసీలు టి.లక్ష్మి, కె.కనకదుర్గ, తహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఎంపీడీఓ జె.స్వర్ణభారతి, ఏపీ కనకారావు, ఏపీఎం డి.శ్రీను, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎం.రాజబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ నాయకులు, బుక్ కీపర్లు, సచివాలయ సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్య వస్తే సహించేది లేదు

కృత్తివెన్ను: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎక్కడైనా తాగునీటి సమస్య వస్తే సహించేది లేదని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. సోమవారం ఆయన చినపాండ్రాక పంచాయతీ రామాపురంలో తాగునీటి సమస్యపై మహిళలకు ఆయన భరోసా ఇచ్చారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వారు మంత్రికి తెలియజేయగా వెంటనే ఆయన సంబంధిత అధికారులతో పైపులైను ఏర్పాటుపై చర్చించారు. రూ.17 లక్షలతో పైపులైను 20 రోజుల్లో ఏర్పాటు చేయాలని అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రమణ, ఈఈ సత్యనారాయణ, డీఈఈ స్రవంతి పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు కృషి

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు



జగనన్న కాలనీలో శిలాఫలకం ఆవిష్కరించిన పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

కోనేరుసెంటర్: జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు తెలిపారు. మండల పరిధిలోని కరగ్రహారం జగనన్న కాలనీలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు సోమవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎవరు ఊహించని స్థాయిలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. బందరు మండలంలోని ఒక్క కరగ్రహారం గ్రామంలోనే దాదాపు 16 వేల మంది పేదలకు స్థలాలు అందాయంటే అది సీఎం గొప్పతనమేనని చెప్పారు. స్థలాల మంజూరు, ఇంటి నిర్మాణాల విషయంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు.

సీఎంకు రుణపడి ఉండాలి..

నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల పక్షపాతి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది పేద కుటుంబాలకు స్థలాలు ఇవ్వడంతో పాటు వారి సొంతింటి కల సహకారం అయ్యేందుకు కృషి చేస్తున్న సీఎంకు లబ్ధిదారులంతా రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, బందెల కవిత నోబుల్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్లు శీలం మారుతీరావు(బాబ్జి), చిటికెన నాగేశ్వరరావు, శొంఠి ఫరీద్, కో ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసమ్మ, మండల విద్యుత్ శాఖాధికారులు రామకృష్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంకలో బోట్ల గణన



నాగాయలంక: సముద్ర జలాల్లో మెకనైజ్డ్, మోటారు బోటుల్లో మత్స్యకారుల చేపల వేటను 61 రోజుల పాటు నిషేధించిన నేపథ్యంలో నాగాయలంక ఫిష్ లాండింగ్ సెంటర్‌లో సోమవారం మత్స్యశాఖ అధికారులు బోట్ల సంఖ్య గణన (ఎన్యుమరేట్) చేపట్టారు ప్రభుత్వం అమలు చేస్తున్న మత్స్యకార భరోసా లబ్ధిదారుల గుర్తింపులో భాగంగా బోట్లు రిజిస్ట్రేషన్, లైసెన్స్‌ల పరిశీలనతో పాటు కళాసీల గుర్తింపు పత్రాలను ఎన్యుమరేషన్ అధికారి వి.మంజూష(గుడివాడ ఎఫ్‌డీఓ), కంకిపాడు వీఎఫ్ఓ ఇంటూరి మాధవీలత తనిఖీలు నిర్వహించారు. నాగాయలంక మండలంలో సముద్రం చేపలవేట సాగించే బోట్లు మొత్తం 1,001 ఉన్నాయని అవనిగడ్డ ఎఫ్‌డీఓ నానపల్లి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం అధ్యక్షుడు లకనం నాగాంజనేయులు, మత్స్యకార సంఘాల నాయకులు కర్రి కృష్ణమూర్తి, నాగిడి తాతారావు, పీతా సుబ్బారావు, స్థానిక మత్స్యశాఖ సహాయకులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉపాధి పనులు

మోపిదేవి: మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. మండల కేంద్రం మోపిదేవిలో ఎంపీపీ రావి దుర్గావాణి, గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి ఆధ్వర్యంలో సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఉపాధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఈజీఎస్ టీఏ హరిబాబు నాయక్ మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ పరిధిలో 600 మంది కూలీలకు 42 వేల పనిదినాలకు గాను రూ.1,14,24,000లు పనులతో అంచనాలు రూపొందించామన్నారు. ఎంపీటీసీ కారుమూరి శివనాగరాజు, పవన్‌కుమార్, నాయకులు వెంకట సురేష్ బాబు, అభిషేకరావు, రాంబాబు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ మజ్ను, గ్రామ కార్యదర్శి త్రిపుర సుందరి, ఎఫ్ఏ సుబ్బారావు, మేట్స్, కూలీలు పాల్గొన్నారు.

గూడూరు: కంకటావలో ఉపాధి హామీ పనులకు వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు భూమి పూజ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పంట బోదెలు మరమ్మతులు చేసుకోవడం ద్వారా చిట్టచివరి పంట పొలాలకు సాగునీరు ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల మోహనరావు, మాజీ సర్పంచ్ బొర్రా దుర్గారావు, కె.నాగేంద్రరావు పాల్గొన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత



కబడ్డీ జట్టుతో ఎమ్మెల్యే రమేష్‌బాబు తదితరులు

నాగాయలంక: రాష్ట్రంలో విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలో ఇటీవల జరిగిన బాలబాలికలు, ఉపాధ్యాయులకు క్రీడలు ముగిసిన నేపథ్యంలో 29వ వార్షిక విద్యా, క్రీడా, సాంస్కృతిక బాలోత్సవాల బహుమతి ప్రదానోత్సవ సభ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ఆవరణలో కళావేదికపై సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి, క్రీడల కమిటీ చైర్మన్ టీవీఎం రామదాసు అధ్యక్షతన సభ నిర్వహించారు. మూడు దశాబ్దాలుగా మండల స్థాయి క్రీడా సాంస్కృతిక పోటీలు దిగ్విజయంగా కొనసాగిస్తున్న మండల విద్యాకుటుంబం సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. విజేతలైన వెయ్యి మందికిపైగా బాలబాలికలు, టీచర్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా క్రీడా, సాంస్కృతిక బహుమతులు అందచేశారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, దివంగత పీఈటీ వర్రే రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు నివాళులర్పించి, జ్యోతిప్రజ్వలన గావించారు. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారి సుధాపావనికి ఎమ్మెల్యే సొంతంగా నగదు బహుమతి అందించారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు రేమాల సుబ్బారావు, భోగాది శేషగిరిరావు, మద్ది చిన్నారి, పరిశె అమ్మన్న, ముమ్మారెడ్డి చంటి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రహదారి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న రహదారి పనులకు ఎమ్మెల్యే రమేష్‌బాబు సోమవారం శంకుస్థాపన చేశారు. చిట్టూర్పు వయా ఘంటసాల మీదుగా జోడుగూడెం వెళ్లే రహదారికి కోటి రూపాయల నిధులు మంజూరు చేశారు. కోడూరు – అవనిగడ్డ రహదారి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వీటితో పాటు జోడుగూడెంలో సీసీ రహదారి పనులను ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించారు. జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, సచివాలయ మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, వైస్ ఎంపీపీ కుంపటి నాగేంద్రబాబు, ఎంపీటీసీ కొడాలి నాగార్జున, పీఏసీఎస్ చైర్మన్లు పరుచూరి రామకృష్ణ, వేమూరి రత్నశేఖర్, తాతినేని వెంకటకృష్ణారావు, ఎస్ఐ కె.శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఏఈ నాగేశ్వరరావు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బంగారు పతక విజేతకు అభినందన

మచిలీపట్నంటౌన్: సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మ్యాథ్స్, సైన్స్ పరీక్షల విభాగంలో స్థానిక నెల్లూరు రవీంద్ర భారతి స్కూల్‌కు చెందిన 4వ తరగతి విద్యార్థిని నాఫీసా తెహమీద్ ప్రతిభ కనబరిచింది. ఈ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి బంగారు పతకాలను సాధించింది. నాఫీసాను స్కూల్ డీన్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ విన్నకోట హరిణి సోమవారం అభినందించారు. ఒలింపియాడ్ నుంచి వచ్చిన ధ్రువపత్రాలను నాఫీసాకు అందజేశారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం సాయంత్రం 4 గంటలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్టు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, న్యాయమూర్తి సుధాకరరావు ముఖ్య అతిథిగా పాల్గొని పలు చట్టాలపై అవగాహన కల్పిస్తారన్నారు. గ్రామ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు.

వృద్ధురాలికి రెడ్ క్రాస్ సంస్థ సాయం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వృద్ధురాలు శనగల నాగేశ్వరమ్మకు జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, బియ్యం, దుస్తులు, హైజనిక్ కిట్స్, పట్టాలు అందచేశారు. తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ బాధితురాలకు సోమవారం ఈ సాయం అందించారు. రెడ్ క్రాస్ సంస్థ మండల చైర్మన్ వై.సుబ్బారావు, వైస్ చైర్మన్ ఆర్.సుబ్రహ్మణ్యం, వీఆర్వో వెంకటరమణ, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోటరీ సేవా కార్యక్రమాలు అభినందనీయం



గూడూరులో బస్ షెల్టర్ ప్రారంభిస్తున్న భాస్కరరామ్ తదితరులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.భాస్కరరామ్ అన్నారు. క్లబ్‌ను సోమవారం ఆయన అఫీషియల్ విజిట్ చేసి క్లబ్ అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. సీనియర్ రొటేరియన్ బి ధన్వంతరీ ఆచార్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలతో కలిసి రోటరీ క్లబ్ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తుండటంతో వ్యాధి తగ్గుముఖం పట్టిందన్నారు. రోటరీక్లబ్ కార్యదర్శి కె.అనుపమముఖర్జీ మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తిని రానున్న రోజుల్లో కూడా కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వ్యవస్థాపకుడు పాల్‌హ్యారిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తొలుత రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ భాస్కర్‌రామ్ గూడూరు సెంటరులో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్మించిన బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. సీనియర్ రోటేరియన్లు మెహర్‌కుమార్, జ్యోతి, బాబు, సాయిప్రసాద్, అజమతున్నీసా పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ప్రత్యేక స్థానం

గూడూరు: సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్‌ది ప్రత్యేక స్థానం ఉందని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.భాస్కరరామ్ పేర్కొన్నారు. మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారిపై గూడూరు సెంటరులో రోటరీ క్లబ్ సౌజన్యంతో నిర్మించిన నాన్‌స్టాప్ బస్ షెల్టర్‌ను సర్పంచ్ లింగం సులోచనారాణితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో బాలికల టాయిలెట్‌ల నిర్మాణం కోసం మచిలీపట్నం క్లబ్ ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. బస్ షెల్టర్‌లో రెండు ఫ్యాన్లు, ప్రయాణికుల కోసం వాటర్ ఫ్రిజ్ క్లబ్ ద్వారా సమకూర్చుతామని ఆయన హామీ ఇచ్చారు. బస్ షెల్టర్ నిర్మాణానికి సహకరించిన రోటరీ క్లబ్ వారికి సర్పంచ్ లింగం సులోచనారాణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ జ్యోతి, పి.మెహెర్‌బాబా, డి.కె.డి.ప్రసాద్, సీహెచ్.సాయి, ఉప సర్పంచ్ ఊసా దివ్యభారతి, సీహెచ్‌సీ డైరెక్టర్ ఎం.ఎ.సలీమ్, గ్రామస్తులు లింగం విజయ్, అమరారపు సుబ్బారావు, ఎం.డి.బషీర్, మెకానిక్ పూర్ణ, సంగా నరసింహారావు, అప్పికట్ల వెంకట్రావు, బత్తిన కోటేశ్వరరావు, బాసంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీపీ ప్రసాద్‌కు మాజీ ఎంపీ బాడిగ పరామర్శ



కృత్తివెన్ను: కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని గరుడ ప్రసాద్‌ను మచిలీపట్నం పార్లమెంటు మాజీ సభ్యుడు బాడిగ రామకృష్ణ సోమవారం పరామర్శించారు. ఇటీవల ఎంపీపీ తనయుడు వంశీకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. దీనిపై ఆయన ఎంపీపీ నివాసం వద్ద పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎంపీపీని పరామర్శించిన వారిలో కొనకళ్ల బుల్లయ్య, పలువురు సర్పంచ్‌లు ఉన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

బొబ్బర్లంక(మోపిదేవి): ప్రతి మహిళా ఇంటి వద్ద పెరటి తోటలు ప్రకృతి సిద్ధంగా పెంచుకుని వాటిని ఆహారంగా తీసుకోవాలని కృష్ణాజిల్లా అడిషనల్ డీపీఎం నాగమల్లేశ్వరి సూచించారు. మండల పరిధిలోని బొబ్బర్లంక గ్రామంలో నవధాన్యాల సాగు, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన సదస్సును బొబ్బర్లంక ఐసీఆర్పీ పి.సురేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా 32 రకాల విత్తనాల నవధాన్యాలు మీ పొలాల్లో చల్లుకోవాలని అలా చల్లడం వల్ల భూసారం పెరిగి భూమి బలంగా, ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వాణి, మండల యూనిట్ ఇన్‌చార్జి పి.నరసింహారావు, వీఓఏ ఎస్.నాంచారమ్మ, సీసీ సత్యశ్రీ, రైతులు పాల్గొన్నారు.